క్లుప్తంగా

ఘనంగా సఫల ఏకాదశి పూజలు



అలంకరణలో అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి

పామిడి: పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ఆదివారం సఫల ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలకు తెల్లవారుజామునా నుంచే అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్ర పారాయణం చేశారు. దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రాకారోత్సవం గావించారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు,అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అలంకరణలో కన్యకా పరమేశ్వరి

పామిడి: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఘనంగా ధనుర్మాస పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్తోత్ర పారాయణాలు, విష్ణు సహస్ర నామ పారాయణం, భగవద్గీత పఠనం , గోదాదేవి, విష్ణు అష్టోత్తర పుష్పార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పల్లకీసేవ, ప్రాకారోత్సవం గావించారు. మంగళహారతి అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నూతన సంవత్సర ప్రారంభ ఆరాధన



మాట్లాడుతున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర ప్రారంభ ఆదివార ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ మాట్లాడుతూ యేసుక్రీస్తు అందరికి ప్రభువు అన్నారు. సర్వ మానవ పాపపరిహారార్థం క్రీస్తు యేసు పరలోక భాగ్యాన్ని సైతం తృణప్రాయంగా త్యజించి ఈ లోకానికి వచ్చారన్నారు. దేవుని సువార్తను ఆయన ప్రకటిస్తూ రోగులను స్వస్థపరుస్తూ ఆయన బోధనలు చేశారన్నారు. క్రీస్తుతోనే నిత్యజీవం లభిస్తుందన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, జకరయ్య, జయరాజు, అబ్రహం, కరుణాకర్, ఇల్లూరు రాజు, ప్రసాద్, రజని, ప్రిస్కిల్లా, సుశీలమ్మ, జయామణి, మాణిక్యమ్మ, రేచెల్, వాణి, కీర్తిమణి తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుడికి పంచామృతాభిషేకాలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి బంగారు కవచాన్ని మేళ తాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి పూజలు చేశారు.

సిరుల చామంతి

- మార్కెట్‌లో బంతిపూలకు డిమాండ్
- కిలో రూ.50 నుంచి రూ.60 పలుకుతున్న వైనం



పెద్దపప్పూరు వద్ద సాగు చేసిన చామంతి

పెద్దపప్పూరు: బంతి పూల సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. మార్కెట్‌లో పూలకు మంచి ధర పలుకుతుండటంతో రైతులకు కలిసివస్తోంది. వివరాల్లోకి వెళితే.. బోరుబావులతో పాటు చాగల్లు, పెండేకల్లు, ముచ్చుకోట జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉండడంతో చాలామంది రైతులు బంతి, చామంతి తోటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటకోత ప్రారంభ దశలోనే ఆశించిన ధర లభిస్తోందని సాగురైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి నియోజక వర్గంలోని పెద్దపప్పూరు, తాడిపత్రి, యాడికి, మండలాల్లో అధికారుల ఈక్రాప్ బుకింగ్ మేరకు బంతి, చామంతి పంటలను దాదాపు 90 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలుస్తోంది. అనంతపురం, తాడిపత్రి, నెల్లూరు తదితర పట్టణాల్లోని మార్కెట్లలో కిలో రూ.50 నుంచి రూ.90 వరకు ధర పలుకుతోంది. ప్రస్తుతం సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో మార్కెట్‌లో పూలకు మరింత డిమాండు పెరిగే అవకాశాలున్నాయి.

మేలైన రకాల సాగు..

రైతులు బంతి, చామంతి మేలైన రకాల మొక్కలను చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి తెప్పించి సాగు చేస్తున్నారు. నాటిన 50 రోజుల నుంచి పూలు కోతకు వస్తాయి. నెలరోజుల పాటు దిగుబడి ఉంటుంది. ఎకరాకు నేల స్వభావాన్ని బట్టి 3 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతన్నలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు కోసం ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు.

బోరుబావుల్లో పుష్కలంగా నీరు



రెండేళ్లుగా భారీవర్షాలు కురవడంతో పాటు చాగల్లు ప్రాజెక్టులోకి వర్షపునీరు వచ్చిచేరడంతో బోరుబావుల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. దీంతో చామంతి పంట సాగు చేస్తున్నాను. ప్రస్తుతం కోత ప్రారంభ దశలోనే మార్కెట్‌లో ఆశించిన ధర వస్తోంది. సంక్రాంతి పండగ సమీపిస్తుండడంతో పంట దిగుబడి పెరగంతో పాటు మార్కెట్‌లో మరింత ధర పెరిగే అవకాశముందని భావిస్తున్నా.

– సూర్యనారాయణ రెడ్డి తిమ్మనచెరువు(పెద్దపప్పూరు)

పూల నాణ్యతను బట్టి ధర



ఈనెలలోనే పంటకోత ప్రారంభమైంది. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. బంతి, చామంతి పంటకు మచ్చతెగులు రాకుండా సకాలంలో మందులు పిచికారీ చేస్తే పూల నాణ్యత బాగుంటుంది. ప్రస్తుతం పంట మొగ్గ దశలో ఆశాజనకంగా ఉంది. 20 రోజుల తర్వాత దిగుబడి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

–ఉమాదేవి, తాడిపత్రి హెచ్ఓ

రోడ్లపై పేరుకుపోయిన చెత్త తొలగించండి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: ప్రధాన రహదారులపై చెత్తచెదారన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ మల్లికార్జున రెగ్యులర్ పీహెచ్ వర్కర్లకు సూచించారు. ఆదివారం ఉదయం ఆయన పట్టణంలోని మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు, 60 ఫీట్ రోడ్డు తదితర ఏరియాల్లో శానిటేషన్ అధికారులు, కార్యదర్శులతో కలిసి పర్యటించారు. దుకాణాల ముందు చెత్తాచెదారం అధికంగా ఉండటంతో రెగ్యులర్ వర్కర్ల చేత తొలగింపజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.4.26 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో 4.26 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏ.ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,41,720 వసూలయ్యింది. ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,84,700 మేర మార్కెటింగ్ ఫీజు వసూలైందని వారు తెలిపారు.

ప్రతిభను వెలికి తీసేందుకే క్రికెట్ పోటీలు



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న దృశ్యం

యాడికి: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్రికెట్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సంత మార్కెట్ వీధికి చెందిన కోడూరు రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ వారు ప్రారంభించారు. పోటీల్లో జిల్లాకు చెందిన 36 టీమ్‌లు పాల్గొన్నాయని, విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు విజయకుమార్, కోడూరు సుబ్బారెడ్డి, రాగుల బాల చంద్రారెడ్డి తెలిపారు. హాజరైన క్రీడాకారులకు నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ మండల వైస్ కన్వీనర్ జీసీ నారాయణ రెడ్డి, సీనియర్ నేత బాలా రమేష్‌బాబు, సీవీఆర్ ట్రస్ట్ చైర్మన్ సీవీ రమణారెడ్డి, ఎంపీటీసీలు వెంకట నాయుడు, నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె : ఎగువపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు..కనంపల్లికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా అదే సమయంలో ఎగువపల్లికి చెందిన నిరంజన్ రెడ్డి గ్రామంలోకి వెళ్లడానికి ఎగువపల్లి సమీపంలో రోడ్డుదాటుతుండగా రెండు బైక్‌లు ఎదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు దాటుతుండగా..

గార్లదిన్నెలోని శింగనమల క్రాస్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. శింగనమల 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. సాలమ్మ అనే మహిళ శింగనమల క్రాస్ సమీపం లో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను 108లో అనంతపురము ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

‘సాధికార’ బస్సుయాత్ర జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు

గుత్తి: గుంతకల్లులో ఈ నెల 9వ తేదీన జరుగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డులో గుత్తి, గుత్తి రూరల్‌కు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్ కుమార్ యాదవ్, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ బస్సుయాత్రకు వచ్చే వారిని తరలించేందుకు ప్రత్యేక వాహనాలతోసాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. మండలం నుంచి పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు



అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు



అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న మహిళలు

పామిడి: మండలంలోని ఖాదర్‌పేట, ఓబుళాపురం గ్రామాల్లో ఆదివారం అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టు పామిడి ఖండ ఆధ్వర్యంలో ఆయా గ్రామవీధుల్లో అక్షింతలను నెత్తిపై ఉంచుకుని ముందుకు సాగారు. ఈసందర్భంగా మహిళలు, చిన్నారులు కలశాలు, కాషాయ జెండాలు ధరించి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఓబుళాపురంలో కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వై సూర్యనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలో ఆదివారం ఆయోధ్య రాముని అక్షింతలను పంపిణీ చేశారు. జయనగర్ కాలనీ, పుట్లూరు రోడ్డు, శ్రీరాముల పేట తదితర ప్రాంతాల్లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈనెల 22న ప్రతి హిందువూ పెద్ద ఎత్తున దీపావళి పండుగను జరుపుకోవాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

కరాటే బ్లాక్‌బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మాస్టర్లు

తాడిపత్రిటౌన్: గన్నెవారిపల్లి కాలనీలో వున్న జపాన్ షూటోరియా మార్షల్ ఆర్ట్స్ కరాటే ట్రెనింగ్ స్కూల్‌లో మాస్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కరాటే బ్లాక్‌బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ నాగరాజు, పీవీఆర్ ఆసుపత్రి వైద్యుడు సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఇందులో రాగశ్రీ , భరద్వాజ్‌లకు బ్లాక్ బెల్ట్, బ్రౌన్ బెల్ట్ 4, బ్లూ బెల్ట్ 3, గ్రీన్‌బెల్ట్ 4, ఆరంజ్‌బెల్ట్10, ఎల్లో బెల్ట్ 12, వైట్‌బెల్ట్ ఐదుగురు విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్లు ప్రభాకర్, హసీనా, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవతల గ్రామోత్సవం



అక్కదేవతలను ఊరేగిస్తున్న దృశ్యం



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

తాడిపత్రి అర్బన్: స్థానిక పుట్లూరు రోడ్డులో వెలసిన అక్కదేవతల గ్రామోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అక్కదేవతల ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే అక్కదేవతలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లో అక్కదేవతలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా 108 మంది మహిళలు పసుపు చీరలను కట్టుకుని కలశాలను నెత్తిన పెట్టుకొని ముందుకు సాగారు. ఈ ఊరేగింపు పుట్లూరు రోడ్డులోని అక్కదేవతల ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ సర్కిల్‌కు చేరుకుని అక్కడి నుండి సీబీరోడ్డు మీదుగా హనుమాన్ జంక్షన్, మెయిన్ బజార్, గాంధీకట్ట నుంచి తిరిగి అక్కదేవతల ఆలయానికి చేరుకుంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ఏపీసీ



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీల్లోని పదోతరగతి విద్యార్థినులందరూ పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ వి.నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు సూచించారు. జిల్లాలోని కేజీబీవీ పదోతరగతి విద్యార్థినులందరికీ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టు టీచర్లకు ‘సీఎస్ఆర్ అకాడమి’ ఆధ్వర్యంలో ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం బుక్కరాయసముద్రం కేజీబీవీలో జరిగిన ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో 10వ తరగతి పరీక్షల్లో అనంతపురం జిల్లా చివరి స్థానంలో నిలిచిందన్నారు. గత విద్యా సంవత్సరంలో పది ఫలితాల్లో రాష్ట్రంలో కేజీబీవీ విద్యాసంస్థలు చివరి స్థానంలో నిలిచాయన్నారు. స్టేట్ రీసోర్స్ పర్సన్లు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించి 10వ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. జీసీడీఓ మహేశ్వరి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల కోసం రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన పంచతంత్ర ప్లాన్ అమలు చేయాలని కోరారు. సీఎస్ఆర్ అకాడమీ కన్వీనర్ ప్రణయ్ సిద్ధార్థ మాట్లాడుతూ చదువుతోనే అన్ని రంగాలూ అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతపురం వెనుకబడిన ప్రాంతం కాబట్టి చదువే అభివృద్ధికి మార్గం అన్నారు. పేద పిల్లల చదువు కోసం ఆర్డీటీ స్ఫూర్తితో సాధ్యమైనంత మేరకు విద్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంఓ గోపాల్, ఏపీఓ నారాయణస్వామి పాల్గొన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న వలంటీర్ వసుంధర

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన గుత్తిరెడ్డి జయమ్మ అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ వసుంధర ఆదివారం సుమారు 500 కి.మీ(రానుపోను) బెంగళూరు వెళ్లి జయమ్మకు పింఛన్ సొమ్ము రూ.3 వేలు అందజేసింది. దీంతో ఆమె వలంటీర్‌తోపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసింది.

మృతుడి కుటుంబానికి సంతాపం



సుధాకర్(ఫైల్)

గుత్తి: పట్టణంలోని కురుబ వీధికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, 8వ వార్డు సచివాలయ కన్వీనర్ సుధాకర్(46) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే సుధాకర్ తన భార్యతో కలిసి ఆదివారం ఉదయం మద్దికెరలో జరుగుతున్న అత్త దినాలకు వెళ్లాడు. అక్కడ బంధువుల ఇంటిలో కూర్చున్న సమయంలో ఉన్న ఫళంగా కుప్పకూలి కిందపడ్డాడు. ఆసుపత్రికి తరలించే సమయంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సుధాకర్ మృతి పట్ల ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బి, పట్టణ కన్వీనర్ పీరా, 8వ వార్డు సచివాలయ ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, వేణు, మైనార్టీ జిల్లా నాయకులు కటిక ఖురేషి అన్వర్ తదితరులు సంతాపం ప్రకటించారు.

భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

గుంతకల్లు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కుల చట్టంపై వివిధ రాజకీయ పార్టీలు, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యాజమాన్యం హక్కులను నిర్ధారించడానికి ఆర్‌డీఓ, జేసీ కోర్టులు పని చేస్తున్నాయన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: బొట్టువానివీధికి చెందిన ఓ వివాహిత ఆదివారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసుల వివరాల మేరకు.. జ్యోతి, ఎరుకుల హనుమంతుకు 10 సంవత్సరాల క్రితం వివాహమైంది. హనుమంతు తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. మనస్తాపం చెందిన జ్యోతి ఆదివారం విషద్రావకం తాగింది.

ఉత్సాహంగా ముత్యాల ముగ్గుల పోటీలు



13వ వార్డులో ముగ్గులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ మల్లికార్జున



తాడిపత్రిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళ

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, మెప్మా ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం పట్టణంలోని 8,13,15,20,22,29,3 వార్డుల్లో నిర్వహించిన పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సందేశాత్మక, సంక్రాంతిని ప్రతిబింబించే రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి వార్డు కౌన్సిలర్ల సహకారంతో బహుమతులు అందజేశారు. తిరిగి వీరందరికీ ఫైనల్ పోటీలు నిర్వహించి విలువైన బహుమతులను అందజేస్తామని వారు ప్రకటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అరుణ, ఎస్.వెంకటలక్ష్మి, జేసీబీ.చాంద్‌బాషా, గంగమ్మ, నీలావతి, వార్డు ఇన్‌చార్జ్‌లు హరినాథరెడ్డి, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో..

తాడిపత్రి అర్బన్: సీబీరోడ్డులోని మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఉదయం 10 గంటలకు నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేసేందుకు గంట సమయం మాత్రమే కేటాయించారు. పలువురు మహిళలు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.